

పెళ్ళిచూపులు కోసం ఏర్పాటు చేసిన గదిలో అతడు, ఆమె మిగిలారు. అంతవరకు ఆ గదిలో ఉన్న పెద్దలందరూ ఏదో ఒక సాకుతో బయటకు జారుకున్నారు. వారిద్దరూ ఆశించిన ఏకాంతం!.... ఒకరి యిష్టాన్ని మరొకరు ప్రత్యక్షంగా తెలుపుకునేందుకు, తెలుసుకునేందుకు అది పెద్దలు కల్పించిన అవకాశం!

సిగ్గుపడుతూ తలవంచుకుని కూర్చున్న వినీల-జడలో విరిసీవిరియని సన్నజాజి మొగ్గలాగే ఉంది. పెళ్ళికూతురి వేషం· ఎలాటివారికైనా అదనపు కళని తెచ్చిపెడుతుంది. అందునా అందమైన వినీల లాంటి అమ్మాయిలసంగతి ఇక చెప్పనవసరం లేదేమో! అరచేతి వెడల్పున జరీ బార్డరున్న ఇటుక రంగు పట్టుచీర, అదే రంగు జాకెట్ వేసుకుని ముత్యాలసెట్టు ధరించిన వినీల దారితప్పి భువికి వచ్చిన మేనకలా ఉంది. గుండె 'గుడుగుడుగుంచం' పాడుతుంటే చేతిలో కర్చీఫ్‌ని మడత నవరిస్తూ మౌనవ్రతం ఆచరిస్తున్న మునికన్యలా నిశ్శబ్దంగా కూర్చుంది. ఇబ్బందిగా కదులుతున్న ఆమె కనురెప్పల్ని, వాటి అంచు మీద సన్నగా గీసిన కాటుక రేఖని, సంపెంగ మొగ్గలాంటి నాసికని, చిగురాకు పెదవుల్ని, చిన్నారి చుబుకం [illegible] పుట్టుమచ్చని పరీక్షగా చూస్తూ పెదవి కదిపాడు మధుకర్.

'మీరు నచ్చారు. మరి....మీ యిష్టం కూడా చెపితే...' అర్థవంతంగా ఆపి నాజూకుగా ఉన్న ఆమె వ్రేలికి ముద్దుగా అమరిన ముత్యాల ఉంగరం మీదకి దృష్టి మరల్చుకున్నాడు. అలా అయితే ఆమె తనకేసి నిర్భయంగా చూసేందుకు ఇబ్బంది ఉండదని అతడి ఉద్దేశ్యం. కాని వినీల తలని మరికొంచెం క్రిందకి వాల్చిందే తప్ప అతడివైపు చూడలేదు.

'చదువుకున్న మీరలా సిగ్గుపడటం ఏం బాగోలేదు. పైగా....ఉద్యోగం చేస్తున్నారు....!'

మధుకర్ మాటలకి వినీలకి ఒళ్ళు మండింది. చదివి, ఉద్యోగాలు చేస్తున్నంత మాత్రాన సిగ్గు వదిలేయాలని రూలుందా? పెళ్ళిచూపుల్లో సిగ్గుపడక, రోడ్డు మీద, ఆఫీసుల్లో సిగ్గుపడతారేమిటి! అనుకుంది కోపంగా.

# విశాలహృదయం

వై. అమృతవల్లి

577

'పోనీలెండి మీకంత బిడియంగా ఉంటే రేపు నా ఫొటో పంపిస్తాను. చూశాక మీ ఉద్దేశం చెప్పండి. అప్పటివరకు నేను కూడా నా నిర్ణయాన్ని ఎవరికీ చెప్పను. ఏమంటారు?'

ఏమంటుంది? గుండెలు వేగంగా స్పందిస్తుంటే మాటలు మరిచిపోయిన దేవకన్యలా కూర్చుండిపోయింది. పాతిక వేలు పెట్టి కొనుక్కుంటుంది కనుక తానే అతడిని ప్రశ్నలు వేసి పరీక్షించి పంపించాలని స్నేహితుల దగ్గర శపథం తీసుకుంది. తీరా..ఇప్పుడేమిటిలా అయిపోతోంది?

'చూడండీ....కట్నం యిచ్చి కొనుక్కుంటున్నారు కనుక మీరు నాకు నచ్చటం మాట అటుంచి నేను మీకు నచ్చాలన్నదే ముఖ్యం అని మా చెల్లెలి అభిప్రాయం.... ఐ మీన్....నాది కూడా అనుకోండి.' తన మనసులో అనుకుంటున్నదే అతడి నోటివెంట రావటం విని కంగారు పడింది వినీల. కొంపదీసి .... పరధ్యానంగా ఆ మాటలు పైకి అనేయలేదు కదా!

'....అందుకనే ఇంతగా మిమ్మల్ని 'ప్రెస్' చేసి అడుగుతున్నాను. మరొకలా భావించి కోపం తెచ్చుకోరు కదూ!'

అప్రయత్నంగా ... అడ్డంగా తిప్పింది వినీల.

'థాంక్స్. ఇకపోతే నా గురించి మిగిలిన వివరాలు .... బహుశా మీ వాళ్ళ ద్వారా వినే ఉంటారు. అయినా స్వయంగా మీకు తెలపటం నా విధి!'

'పర్వాలేదు. మీమీద ఆమాత్రం నమ్మకం ఉంది' అందామనుకుంది వినీల. కాని....స్వరం ఇంకా అధీనంలో లేదని గ్రహించి మౌనం వహించింది.

'ఎమ్. టెక్' పాసయి అయిదు సంవత్సరాలుగా హెచ్. ఎ. ఎల్. లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. మీరు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. చేయాలనే నియమం మీకుంటే అభ్యంతరం లేదు!' అన్నాడు. అతడి మాటల్లో కొంచెం అతిశయం ఉన్నట్లుగా తోచింది వినీలకి.

'నేను మాట్లాడటమే కాని, మీరు పెదవి కదపనేలేదు.' అంటూ నవ్వాడు. 'సరే, మీరు వెళ్ళిపోవచ్చు!'

మధుకర్ ఆమాట అన్నదే తడవుగా చటుక్కున లేచి తడబడుతున్న కాళ్ళతో గదిలోకి వచ్చిపడింది వినీల.

'ఇంత సేపు ఏం మాట్లాడుకున్నారు?' స్నేహితురాలి ముఖాన చిరుచెమటని గమనించి 'ఫాన్' వేస్తూ అడిగింది సునీత.

'నేనేం మాట్లాడలేదు.' మంచంమీద కూర్చుని కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ అంది వినీల.

'అంటే....'ఛాన్స్' అతనికే వదిలేశావన్న మాట!'

'పోవే! ముక్కుముఖం తెలినివాడితో ఏం మాట్లాడాలి?' అంది చిరుకోపం నటిస్తూ.

'అఘోరించావులే. ఈ ప్రశ్న అప్పుడే వేస్తే ప్రశ్నలు....జవాబుల పత్రం తయారుచేసి కంఠతా చేయించే వాళ్ళం. ఊఁ....ఇంతకీ ఆ మహానుభావుడి ఉపన్యాసమైనా సరిగ్గా విన్నావా?'

'ఏమోనే, నాకు జ్ఞాపకం లేదు.' తప్పించుకోబోయింది వినీల.

'ఈ మతిమరుపు సంగతికూడా ముందే చెప్పి ఏడిస్తే 'టేప్‌రికార్డర్' పెట్టేవాళ్ళం. ఛ....ప్లానంతా ఫెయిలైపోయింది.' నీరసంగా కుర్చీలో కూలబడింది సునీత.

'పోనీలే. నీకూ రేపోమాపో ఇలాటి 'ఛాన్స్' రాకపోదు. అప్పుడు చూపించు నీ ప్రతాపం.'

'చూస్తావుగా!' నవ్వి, పనిపిల్ల తెచ్చిన కాఫీ కప్పులు అందుకుంది సునీత.

'అలసిపోయావు కానీ, కాఫీ సేవించు!' స్నేహితురాలి మాటలకి తేలిగ్గా నవ్వింది వినీల. పెళ్ళివారటు వెళ్ళగానే 'మళ్ళీ శుభలేఖలో 'లగ్నం' చూసుకుని వస్తా' అంటూ తానుకూడా ఇంటికి బయల్దేరింది సునీత.

*

వీధిలో పూలమ్మేవాడి కేకవిని గబగబా వరండాలోకి వెళ్ళింది వినీల. అప్పుడే గేటులోంచి వస్తున్న పోస్టుమాన్ చిర్నవ్వుతో "మీకేనమ్మా" అంటూ నీలిరంగు కవరొకటి ఇచ్చి వెళ్ళిపోయాడు. గుండె ఝల్లుమంటుంటే మధుకర్ మాటలు జ్ఞాపకం చేసుకుంటూ కంగారుగా గదిలోకి పరుగెత్తింది.

'అమ్మా... మీరేనా పిలిచింది?' గేటు దగ్గర్నుంచి పూలమ్మేవాడి కేక దూసుకు వచ్చింది. తలుపులు చేరవేసి కవరు చింపబోతున్న వినీల చిరాగ్గా దాన్ని దిండుక్రింద పెట్టి వరండాలోకి వెళ్ళింది. తట్ట దింపుకుని మల్లెమొగ్గలు లెక్కపెట్టి ఆమె పైటకొంగులో వేశాడు. రోజూలాగా వాటిల్లో మంచివి కానివి ఏరలేదు వినీల. దబ్బులిచ్చేసి వంటింట్లోకి వెళ్ళి పూలు గిన్నెలో వేసి తిరిగి వస్తూ బామ్మ, తల్లి—ఏ స్థితిలో ఉన్నారో గమనించింది. పూజగది బయట వసారాలో మంచంమీద వాలి భారతం దీక్షగా చదువుకుంటోంది బామ్మ. తల్లి మంచానికి కొంచెం దూరంలో కూర్చుని పత్రిక తిరగేస్తోంది. తేలిగ్గా నిట్టూర్చి నిశ్చింతగా మంచంమీద పడుకుని ఉత్తరం చదవటంలో లీనమైంది వినీల.

గులాబీరంగు కాగితం మడతలు తిప్పుతుంటే ఫోటోజారి గుండెలమీద పడింది. క్షణంసేపు ఫొటోకేసి చూసింది. గార్డెన్‌లో కాబోలు.... కుర్చీలో కూర్చుని పుస్తకం చూస్తూ తీయించుకున్నాడు. నిలువుచారల ఫుల్‌హాండ్స్ షర్టు, డార్క్ కలర్ పాంట్ అతడి పర్సనాల్టీకి హుందాతనాన్ని తెచ్చిపెట్టాయి. నవ్వుతూ ఆగినట్టున్న పెదవులు, పలకరించే చూపులు ముఖంలో చిర్నవ్వు ఛాయలు.....అందంగా ఉన్నాడనిపిస్తున్నాడు.

'అయినా' మగవాడికి అందమేమిటి? నీటైన వ్యక్తిత్వమే నిజమైన సౌందర్యం. అదే ముఖ్యం- ఆడది సుఖపడాలంటే. కానీ, తనకి పరిచయమైంది బాహ్యరూపం ఒక్కటే. అతడి వ్యక్తిత్వం ఎలాటిదో మరి, అనుకుంటూ ఫొటో ప్రక్కన పెట్టి ఉత్తరంలోకి చూసింది.

వినీలగార్కి :

ఇప్పుడు చెప్పండి. నేను మీకు నచ్చానా? మీ దగ్గర్నుంచి ఎలాంటి జవాబు రాకపోతే నచ్చలేదనే భావిస్తాను.

ఇకపోతే....ఒకరి నొకరు యిష్టపడ్డాక కట్నం ముఖ్యం కాదు. మీరే నాక్కావాల్సిన విలువైన కట్నం. కట్నం తీసుకోనని వేదికలెక్కి ప్రమాణాలు చేయలేదు...కానీ, నా మనసులో చేసుకున్న నిర్ణయం అదే! ఈ సంగతే మా వాళ్ళు నేరుగా మీ వాళ్ళకి చెపుతారనుకుంటాను.

ఇంకా ఎంతో వ్రాయాలని ఉంది. కాని.... సమయం రావాలి. సందర్భం కుదరాలి. అందుకే ఇంతటితో ముగిస్తున్నాను. జవాబు వ్రాస్తారుకదూ?

—మధుకర్

అతడు వ్రాసిన దాంట్లో అర్థం కానిదేమీ లేకపోయినా పదేపదే చదువుకుంది వినీల. జవాబు వ్రాయాలని కూర్చునేసరికి కలం పెట్టిన చోటే ఆగిపోయింది. అంతటితో ఆ ప్రయత్నాన్ని

మర్నాటికి వాయిదా వేసుకుని ఆలోచనలో పడింది.

మూడవ నాటికి జవాబు అందుకున్న మధుకర్ సంతృప్తిగా నవ్వుకున్నాడు. ముద్దులొలికే అక్షరాలతో ముచ్చటగా మూడే లైన్లు ఉన్న ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు.

శ్రీ మధుకర్‌గారికి :

నా జాబు మీ ప్రశ్నకి జవాబుగా తీసుకుంటానంటే నాకు అభ్యంతరం లేదు. కళ్ళకి కనిపించేది మనిషి, కనుపించనిది మనసు. అయినా ఇది పెద్దలు చేస్తున్న పెళ్ళి కనుక ఒకరి మనసు ఒకరు తెల్సుకునేందుకు అవకాశం లేదు మరి।

—వినీల

ఆ రోజే తన నిర్ణయాన్ని తలిదండ్రులకు తెలిపాడు మధుకర్. ఆ వెంటనే పెద్దలు సమావేశమై, లగ్నాలు నిర్ణయించారు. పెళ్ళి పనులు చురుగ్గా సాగిపోతున్నాయి. చూస్తుండగానే వారం రోజుల్లోకి వచ్చేసింది పెళ్ళి.

సునీతని వెంట తీసుకుని వెళ్ళి చీరలు కొనుక్కుంది వినీల. ఆ రోజుకి ఆమెను బలవంతంగా ఇంట్లో ఉంచేసుకుంది. మధ్యాహ్నం ఇద్దరూ హాల్లో చాప పరుచుకుని శుభలేఖలమీద అడ్రస్‌లు వ్రాస్తూ కూర్చున్నారు. పోస్టుమాన్ కేక విని లేచి వెళ్ళింది సునీత. కవరు తెచ్చి 'నీకే' అంటూ వినీల ఒళ్ళో పడేసింది. పైన అడ్రస్ చూసింది వినీల. ఆ దస్తూరి ఎవరిదో వెంటనే గుర్తు పట్టింది. దడదడ లాడుతున్న గుండెల్ని సర్దుకుంటూ కవరు చింపింది. శుభలేఖతోపాటు, నాలుగు మడతల నీలిరంగు కాగితం కూడా ఉంది.

డియర్ నీలూ,

ఇదే నా పెండ్లి పిలుపు. పెళ్ళి కూతురివై వచ్చని పందిట్లో కల్సుకుంటావుకదూ?

నీ వన్నట్లుగా, నిజంగానే ఒకరి మనసు లొకరు తెల్సుకునేందుకు మనకి అవకాశం లేదు. మనసొకరితో మనువొకరితో జరగటం ఈ రోజుల్లో 'సహజం' అయిపోయింది. కానీ.... నా దృష్టిలో అది అన్యాయం.

నా ప్రాణస్నేహితుడు శేఖర్ నిన్ననే వైజాగ్ నుండి వచ్చాడు. మా యిద్దరి మధ్య ఎలాటి రహస్యాలు, తెరలు ఉండవు. అతడు కోరకముందే నీ ఫొటో చూపించాను. చూచి 'ఇది రెండవసారి ఈమెని చూడటం' అన్నాడు. మొదటిసారిగా రెండు సంవత్సరాల క్రితం పనిమీద హైద్రాబాద్ వెళ్తే ఒక హోటల్లో తన ప్రక్క-రూమ్‌లో ఓ యువకుడితో చూచాననీ ఇద్దరూ కల్సి సరదాగా తిరిగే వారనీ చెప్పాడు. నిజమేదైనా నిన్ను చేసుకోటానికి ఎలాంటి అభ్యంతరం లేదు నాకు. ప్రతి మనిషి గతంలోనూ ఏవో కొన్ని లోటుపాట్లు ఉంటూనే ఉంటాయి. అన్నీ పట్టించుకోవటమే పనిగా పెట్టుకుంటే జీవితంలో సుఖశాంతులు మిగలవు. కనుక ఆ విషయాన్ని ఇంతటితో మర్చిపోయి..ఎప్పటిలాగే నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నాను. ఇంక ఉండనా మరి; ఆశీస్సులతో—మధుకర్.

*

శ్రీ మధుకర్ గార్కి :—

మీ విశాల హృదయానికి నా జోహార్లు. కాని ఆ విశాలతని అర్థం చేసుకునే శక్తి నాకు లేదు. అలాంటప్పుడు ఈ పెళ్ళి జరగకపోవటమే మంచిది. ఒకరి నొకరు అర్థం చేసుకోగలిగితేనే జీవితం సుఖమయం అయ్యేది. మీ విశాల హృదయాన్ని చాటుకోటానికి మీరు చేస్తున్న త్యాగాన్ని సహించలేను.

ఇక పోతే మీరు విన్న దాంట్లో నిజం ఇది. హోటల్లో నాతోపాటు ఉ[illegible]వ్యక్తి మా పెద్దమ్మ కొడుకు సతీష్. ఉద్యోగం రాకముందు ఓ బ్యాంక్ ఇంటర్‌వ్యూకి వెళ్ళినప్పుడు నాకు తోడుగా వచ్చాడు. బంధువులెవరూ లేకపోవటం వలన హోటల్లో బస చేశాం. ఎలాగూ అంత దూరం వెళ్ళాం కదా అని నాలుగు రోజులపాటు ఉండి ఊరంతా తిరిగి చూశాం.

ఆడది ఓ మగాడితో కనిపించిందీ అంటే అతడెవరైనాకానీ ఆమె ప్రియుడేనని అభిప్రాయ పడే మనుషులు మన 'సొసైటీ'లో చాలా మంది ఉన్నారు. 'నిజం' ఏమిటో నన్ను అడగకుండానే మీ అభిప్రాయం మీరు చెప్పారు. నా అభిప్రాయం ఏమిటో పైన చెప్పాను. ఆడది తొందర పడినా, అపోహపడినా గెల్చుకుపోయే నేర్పు, అవకాశం మగ వాడికి ఉంటాయి. కాని, మగవాడిలో ఆ తొందరపాటు భావనలు ఒకేసారి 'స్త్రీ' జీవితాన్నే బలి తీసుకుంటాయి. అందుకని తెల్సి, తెల్సి జీవితాన్ని నరకం చేసుకోలేను

ఇంక శెలవు

వినీల.

తిరుగు టపాలో ఆమె దగ్గర్నుంచి వచ్చిన జవాబు చదువుకుని మధుకర్ లోని విశాల హృదయం బిత్తర పోయింది।

*



తాము ఊళ్ళోగాని, ఇంట్లోగాని లేనప్పుడు, తమ భార్యలు 'చెడ్డ తిరుగుళ్ళు' తిరుగుతారేమోనని-పూర్వం రోజుల్లో (కొన్ని దేశాల్లో) ఇనపకచ్చడాలు (చేస్టిటీ బెల్ట్)నడుముకు బిగించి, తాళం వేసేసి, వెళ్ళిపోయేవారు. ఈ 'బెల్ట్' 'శీలరక్షణి' అన్నమాట!....రామ రామ ఈ విధానం తగ్గిపోయిందనుకోవటం పొరపాటు అని – ఈజిప్ట్‌లోని ఒక భర్తగారు—ఈ మధ్యనే ఋజువు చేశాడు. అతను వ్యాపారరీత్యా కువైట్, లిబియా దేశాలు తిరుగుతూ ఉంటాడు. అలాంటప్పుడు, భార్యకు 'శీలరక్షణి' వేసేస్తాడన్నమాట. తాను లేనప్పుడు తన భార్య 'రక్షణి'ని తొలగించేసి, తన 'కజిన్'తో వ్యవహారం నడుపుతున్నదని అనుమానం వచ్చి-అతను ఆ 'కజిన్'ను హత్య చేశాడు! కువైట్ పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి, ఈజిప్ట్ పంపించారు. ఇలాంటి నేరమే అతను ఇదివరలో కూడా చేశాడు; అయితే సాక్ష్యాధారాలు సరిగా లభించకపోవడంచేత, అప్పుడు విడిచిపెట్టేశారు.

"నా భర్త నన్ను నేల మీదికి తోసేసి, బలవంతంగా ఈ బెల్ట్ బిగించేసి వెళ్ళిపోతాడు. కదలడానికి కూడా నాకు చాలా బాధగా వుందని, ఆ బెల్ట్ తీసేయమనీ ఎన్నిసార్లో ప్రార్థించాను" అని అతని భార్య పోలీసులకు చెప్పింది!